క్లుప్తంగా

ఫెయిల్యూర్ ఈవీఎంల తరలింపు



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన ఈవీయంలలో ఫెయిల్యూర్ అయిన వాటిని బెంగళూరుకు తరలిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం టెక్కే మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బెంగళూరు బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లలో 435 మిషన్లు ఫెయిల్ అయ్యాయన్నారు. వాటిని తిరిగి వెనక్కి పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రియాజ్ బాషా, చంద్రశేఖర్ రెడ్డి, శివరాంరెడ్డి, సాయిరాం రెడ్డి, నరసింహ, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

నంద్యాల(అర్బన్): ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని పీఆర్‌టీయూ నంద్యాల మండల అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి భాస్కరరెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సంఘం నాయకులతో సమావేశమై వారు మాట్లాడారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 5 తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. బోధనకు ఇబ్బందికరంగా ఉన్న యాప్స్‌ను తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, శ్రీనివాసరెడ్డి, శివనాగిరెడ్డి, విజయరావు, ఆనందప్ప, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్): కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి శిల్పిసుబ్బరాయుడు కోరారు. ఆర్థిక ఇబ్బందులతో అనేక కుటుంబాలు గడ్డపారలు, ఉలులు, సుత్తెలు మూలన పడేసి ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్నారని, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ సోమవారం స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉన్న పోస్టుబాక్స్‌లు వినతి పత్రాలు వేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్, నాగసుబ్బరాయుడు, బాలుడు, తిరుపాలు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అపోహలు వీడండి

గోస్పాడు: కుష్టు వ్యాధిపై అపోహలు వీడండని, ఈ వ్యాధికి చికిత్స ఉందని గోస్పాడు వైద్యాధికారి డాక్టర్ గోపాల్ అన్నారు. మండల కేంద్రం గోస్పాడులో సోమవారం జాతీయ కుష్టు నిర్మూలన–అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా కుష్టువ్యాధి నిర్మూలనకు ఈనెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్టు రహిత దేశంగా చేయడానికి ఆరోగ్య సిబ్బంది, ప్రజలు కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

నంద్యాల(సెంట్రల్): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించేలా రైతులను చైతన్యపరచాలన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందించండి

నంద్యాల(అర్బన్): గిరిజన గూడేల్లో నివసించే వారు విషజ్వరాలతో విలవిలలాడుతున్నారని, అక్కడ వైద్య సేవలు అందించి ఆదుకోవాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా తండాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకుల రెసిడెన్షియల్, గిరిజన బాలికల వసతి గృహాల్లో సైతం విద్యార్థులు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

హామీలు గుర్తుకొస్తున్నాయి!



పంటపొలంలో రైతన్న



రక్షణ గోడ లేని కుందూనది

- ➤ తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ. 15 వేల చొప్పున సాయం అందజేస్తామని కూటమి సర్కారు హామీ ఇచ్చింది. స్కూళ్లు తెరిచి నెల దాటినా అతీగతీలేదు. కనీసం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా పథకం అమలుపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
- ➤ చదువుకున్న ప్రతి నిరుద్యోగికి నెలనెల రూ.3వేలు ఇస్తామన్నారు. అధికారం చేపట్టి నెలన్నర అవుతున్నా ఆ ఊసే లేదు. ఇప్పటికైనా ఆ ఆ హామీని అమలు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.
- ➤ వర్షాకాలం వచ్చిందంటే నంద్యాల ప్రజలకు వరద భయం. ఎన్నికల్లో మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ కుందూనది వెంట వరద రక్షణ గోడ నిర్మించి పట్టణానికి వరద రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే పట్టణం నుంచి వైఎస్సార్‌నగర్ వెళ్లేందుకు కుందూనదిపై నిర్మిస్తున్న బ్రిడ్జిని పూర్తి చేస్తానని మాట ఇచ్చారు. వాటిని ఆచరణలో పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- అమలుకు నోచుకోని కూటమి సర్కారు హామీలు
- నెలన్నర నుంచి ఎదురుచూస్తున్న ప్రజలు
- అసెంబ్లీ సమావేశాలపై ఆశ
- హామీలపై ప్రజాప్రతినిధులు గళమెత్తాలని వేడుకోలు

నంద్యాల/ఆళ్లగడ్డ: ఎన్నికల్లో గెలవడం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అనేక హామీలు ఇచ్చింది. చాలా మంది నమ్మి ఓటేసి గెలిపించారు. అధికారం చేపట్టి నెలన్నర రోజులు అవుతున్నా కూటమి సర్కారు ఆ హామీల ఊసే ఎత్తడం లేదు. శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కూటమి సర్కారు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 1. యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ 3 వేల నిరుద్యోగ భృతి, 2. స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ 15 వేలు, 3. ప్రతి రైతుకు ఏడాదికి రూ 20 వేలు పెట్టుబడి సాయం, 4. 18 సంవత్సరాలు పై బడి 60 సంవత్సరాల వయస్సు లోపల ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ 1500 నగదు, 5. ప్రతి ఇంటికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, 6. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలు చేస్తామని ప్రకటించారు.ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనైనా వీటిపై చర్చించి విధివిధానలపై ప్రకటన చేస్తారని వివిధ వర్గాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు తమ తరఫున గళమెత్తాలని కోరుతున్నారు.

తల్లికి వందనం కోసం ఎదురుచూపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న అమ్మ ఒడి కింద ఒక్కో విద్యార్థికి రూ.15వేలు చొప్పున ప్రతి ఏడాది పాఠశాల తెరిచిన వెంటనే తల్లుల ఖాతాల్లో నిధులు జమ అయ్యేవి. ఇదే పథకాన్ని తల్లికి వందనం కింద ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందజేస్తామని కూటమి సర్కారు ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచింది. అయితే, ఇంత వరకు ఆ పథకం ఊసేలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకం కింద ఒక్క నంద్యాల నియోజకవర్గంలోనే గతేడాది (2022–23) 26,580 మంది విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో రూ.34.56 కోట్లు జమ అయ్యాయి. ఇప్పుడు పాఠశాలలు తెరిచి నెలన్నర అవుతున్నా ఆ ఊసే లేదు. ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థికి రూ.15వేలు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతుకు దక్కని భరోసా

ఖరీఫ్ ప్రారంభమైన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల ఖాతాల్లో రైతు భరోసా కింద నిధులు జమ అయ్యేవి. గత ఏడాది ఖరీఫ్‌లో 24,527మంది రైతులకు రూ.13.54 కోట్లు మొదటి విడతగా జమ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైన ఇంత వరకు టీడీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ముందు రైతులకు ఏడాదికి రూ.20వేలు అందజేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు ఇప్పటి వరకు ఆ హామీ ఊసే ఎత్తకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే రైతులకు నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి పథకాల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు, వారికి రావాలసిన మొత్తం వివరాలు..

మండలం	అన్నదా సుఖీభవ లబ్ధిదారులు	అందాల్సిన మొత్తం రూ. లలో	తల్లికి వందనం లబ్ధిదారులు	అందాల్సిన మొత్తం రూ లలో	నిరుద్యోగ భృతి లబ్ధిదారులు	ప్రతి నెల ఇవ్వాల్సిన మొత్తం రూ. లలో
ఆళ్లగడ్డ	10,056	20,11,20,000	15,572	23,35,80,000	25,604	7,68,12,000
రుద్రవరం	9,758	19,51,60,000	10,098	15,14,70,000	15,451	4,63,53,000
చాగలమర్రి	7,155	14,31,00,000	12,490	18,73,50,000	16,059	4,81,77,000
శిరివెళ్ల	8,739	17,47,80,000	11,200	16,80,00,000	18,516	5,55,48,000
ఉయ్యలవాడ	5,839	11,67,80,000	4,068	6,10,20,000	8,420	2,52,60,000
దొర్నిపాడు	4,510	9,02,00,000	5,055	7,58,25,000	8,476	2,54,28,000
మొత్తం	45,607	91,21,40,000	58,483	87,72,45,000	92,526	27,75,78,000

యాభైఏళ్లకే పింఛన్ అన్నారు



ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామన్నారు. నాకు పింఛన్ వయస్సు ఉంది. ఇచ్చిన మాట ప్రకారం కొత్త పింఛన్ మంజూరు చేసి నెలకు రూ. 4 వేలు ఇవ్వాలి. కూటమి సర్కారు ఏర్పడి నెల దాటిపోయింది. పింఛన్ హామీ ఎప్పుడు అమలు చేస్తారోనని ఎదురుచూస్తున్నా. –అన్వర్‌బాషా, శిరివెళ్ల

రూపాయి సాయం అందలేదు



గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభం కాకముందే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయంగా నిధులు జమ చేసేది. కూటమి సర్కారు ఎన్నికల ముందు పంటసాగు కోసం రైతులకు ప్రతి ఏడాది రూ.20 వేలు ఇస్తానని హామీచ్చింది. ఇప్పుడు ఖరీఫ్ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇంత వరకు ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందలేదు. త్వరగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆచరణలో పెట్టాలి. –నాగేశ్వరరెడ్డి, సాంబవరం, గోస్పాడు(మం)

అన్నదాతకు రూ. 20 వేలు ఇస్తామన్నారు



కూటమి అధికారంలోకి వస్తే రైతులకు కష్టాలు లేకుండా చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద పంట పెట్టుబడికి ఏటా రూ. 20 వేలు సాయం అందిస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. కుందూవెంట నారుమళ్లు సిద్ధం చేసుకున్నాము. ఇచ్చిన మాట ప్రకారం పంటసాగుకు సాయం అందించాలి. –ఉసేనయ్య, క్రిష్టిపాడు

'తల్లికి వందనం' ఏదీ?



గతంలో పాఠశాల ప్రారంభం నాటికే అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15వేలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో రూ. 15 వేల చొప్పున ఇస్తామన్నారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. హామీ ప్రకారం రూ.30 వేలు వస్తాయి. స్కూళ్లు తెరిచి నెలన్నర అవుతుంది. తల్లికి వందనం పథకం అమలుపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. –మహ్మద్ అలీ, చాగలమర్రి

నిరుద్యోగ భృతి ఇంకెప్పుడు



టీడీపీ సర్కారు అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతి ఇస్తానంది. నేను డిగ్రీ చదువుకున్నాను. ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు రావాలి. కొత్త ప్రభుత్వం వచ్చి 40రోజులు దాటుతున్నా నిరుద్యోగ భృతి విధివిధానాలే ఖరారు చేయలేదు. కనీసం ఎప్పటి నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తారో చెప్పాలి. – పఠాన్ సల్మాన్‌ఖాన్, నిరుద్యోగి, నంద్యాల

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



వినికిడి యంత్రాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మధుమణి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఉచిత శస్త్రచికిత్సలు, వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పాణ్యం మాజీ శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బనగానపల్లె మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆ నర్సింగ్‌హోం ఆధ్వర్యంలో సోమవారం 34వ ఉచిత శస్త్రచికిత్సల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధుమణి కుటుంబంతో తమకు అనేక దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఉందని, ప్రతి సంవత్సరం వారు ఖరీదైన శస్త్ర చికిత్సలను ఉచితంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. వైద్య సేవలే కాకుండా వడ్డీ లేని విద్యా రుణాలు ఇవ్వడం , పేద విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. అనంతరం వినికిడి లోపం ఉన్న వారికి మాజీ ఎమ్మెల్యేల చేతుల మీదుగా వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మణిదీప్, మధుప్రీతి, సింధు, ప్రణీత్, రవికృష్ణ, సూర్యనారాయణరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో జార్తలు



ఉయ్యాలవాడ : మండలంలోని నర్సిపల్లె గ్రామంలో దస్తగిరిస్వామి, మౌలాలి స్వామి జార్తలు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం ముగిసిన 5వ రోజు జార్తలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి అనంతరం పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

స్పోర్ట్స్

జాతీయ స్థాయి జూడో పోటీల్లో ఏపీ పోలీసుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: అస్సాంలో జూన్ 24 నుంచి 30 వరకు జరిగిన జాతీయ స్థాయి 9వ ఆల్ ఇండియా జూడో క్లస్టర్– 2024 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో మొత్తం 9 పతకాలను సాధించారు. అందులో ఒక బంగారు పతకం, సిల్వర్ మెడల్స్ 2, కాంస్య 6 పతకాలను సాధించి చరిత్ర సృష్టించిన పోలీసులను ఎస్పీ ఏఆర్ దామోదర్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అభినందించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ నుంచి పీనాక్ సిలాత్ పోటీలో పాల్గొన్న కె.చరణ్ తేజ (నెల్లూరు, ఏఆర్ పీసీ) అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించారు. పెంచాక్ సిలాత్‌లో యం.రాజశేఖర్ (నెల్లూరు, హెచ్‌సీ) , తైక్వాండోలో కె.అరుణ్ కుమార్ (మన్యం పార్వతిపురం, పీసీ) సిల్వర్ మెడల్ దక్కించుకున్నారు. పెంచాక్ సిలాత్, కరాటే పోటీల్లో పి.కల్పన (కర్నూలు, డబ్ల్యూఆర్‌ఎస్‌ఐ), కరాటే పోటీలో నెల్లూరు జిల్లాకు చెందిన ఏ.శ్రావణి (నెల్లూరు, ఏఆర్ పీసీ) కాంస్య పతకాలను సాధించారు. కరాటే పోటీలో టి.పావని (వైజాగ్, మహిళా కానిస్టేబుల్), వి.ప్రియాంక (విజయవాడ, ఏఆర్ మహిళా ఏఆర్ మహిళా కానిస్టేబుల్) కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. తైక్వాండోలో ఎస్.ఫరహతుల్లా (నంద్యాల, పీసీ) సాధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒకవైపు పోలీసులుగా విధులు నిర్వహిస్తూనే మరోవైపు నిరంతర సాధనతో క్రీడల్లో రాణించడం చాలా గొప్ప విషయమన్నారు.

నేడు సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): జిల్లా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 23వ తేదీ పట్టణంలోని ఎస్‌డీఆర్ వరల్డ్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విజయవాడలో ఆగస్టు 4, 5 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 23వ తేది ఉదయం 11 గంటలకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో పాటు నాలుగు ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాల కోసం సెల్ : 9642587333 నంబరును సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



బొమ్మలసత్రం సెంటర్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రకృతి వ్యవసాయంలో పని చేసే ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో బొమ్మలసత్రం సెంటర్‌లో ధర్నా చేసి, తర్వాత ప్రకృతి వ్యవసాయం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న 16 నెలల వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డీపీఎంఓ నరేంద్ర కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రపంచమంతా ప్రకృతి వ్యవసాయం వైపు చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు.

సంక్షిప్తం

ధ్రువపత్రాల జారీలో నిర్లక్ష్యం చేయొద్దు

దొర్నిపాడు: విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాల జారీలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ నాగరాజు వీఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. ఏఓ సునీత, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ సుప్రియ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించండి

రుద్రవరం: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మురుగును తొలగించాలని ఆ కాలనీ వాసులు సోమవారం ఎంపీడీఓ రామచంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. వర్షాకాలంలో ఈమార్గంలో వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందని వాపోయారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ రఘురాం, డిప్యూటీ తహసీల్దార్ తులసికృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలువురు సమస్యలపై అర్జీలు అందజేశారు. అనంతరం వారు ఉద్యోగులతో సమావేశం నిర్వహించి అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ట్రాన్స్‌కో ఏఈ గురప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ మధ్యవర్తిత్వ న్యాయవాదుల ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లోక్‌అదాలత్ మధ్యవర్తిత్వ న్యాయవాదులుగా ఆరుగురిని ఎంపిక చేసినట్లు మండల లీగల్‌సెల్ అధికారులు సోమవారం తెలిపారు. ఎంపికైన వారిలో ఎం .విజయశేఖర్‌రెడ్డి, ఎం.శివశంకర్‌రెడ్డి, అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు, ఖాదరబాద్ నర్సింగరావు, అరిగెల రఘుప్రకాష్, బొల్లెద్దుల రవికుమార్ ఉన్నారని వెల్లడించారు. వీరికి త్వరలో కర్నూలు జిల్లా కోర్టులో శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. లోక్‌అదాలత్‌లో త్వరితగతిన కేసుల పరిష్కారానికి ఈ ఆరుగురు న్యాయవాదులు తోడ్పడతారని తెలిపారు.

స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఆళ్లగడ్డ: స్టాంపులను అధిక రేట్లకు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని సబ్‌రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12 మంది రైటర్లకు లైసెన్స్ జారీ చేశామన్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చలానా రూపంలో స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఆళ్లగడ్డ: కోటకందుకూరు మెట్ట వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో హసీన(40) అనే మహిళ మృతి చెందారు. రూరల్ ఎస్‌ఐ నరసింహులు వివరాల మేరకు.. కోటకందుకూరు గ్రామానికి చెందిన హసీనా రొట్టె పండగకు నెల్లూరుకు వెళ్లారు. సోమవారం ఊరికి తిరుగు ప్రయాణమైన ఆమె ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిపై బస్సు దిగింది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీ కొట్టి వెళ్లింది. తలకు తీవ్రగాయం కావడంతో ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందారు. ఈ మేరకు భర్త మగ్బుల్‌బాషా ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

రుద్రవరం: ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి (27) అనే వివాహిత సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దాదాపు పదేళ్ల క్రితం శ్రీలక్ష్మికి ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన బాలస్వామితో వివాహమైంది. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. అయితే కొంత కాలం నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ కారణంతో వాటర్ హీటర్‌తో భర్తే భార్యను హత్య చేశాడని కొందరు, కాదు ఆమె మనోవేదనకు గురై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని మరి కొందరు చెబుతున్నారని, అయితే పూర్తి వివరాలు పోస్టుమార్టంలో తెలుస్తాయని ఏఎస్‌ఐ తెలిపారు.

విద్యాభివృద్ధే లక్ష్యంగా శిక్ష సప్తాహ్



విద్యార్థులకు బోధన అభ్యసన చేస్తున్న దృశ్యం



క్రిష్టిపాడులో అభ్యసన సామగ్రితో ప్రదర్శన

నంద్యాల(న్యూటౌన్): విద్యాభివృద్ధే లక్ష్యంగా వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, సర్వశిక్ష అభియాన్ జిల్లా అధికారి లలితమ్మ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతానికి జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లు, ఎంఈఓలు బాధ్యత తీసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో..

నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యావారోత్సవాలు ఘనంగా జరిగాయి. వనరులతో కూడిన బోధన సామగ్రిని విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- స్థానిక బాలచంద్ర సమతా విద్యానికేతన్‌లో జరిగిన విద్యావారోత్సావానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పెద్దలను ఆహ్వానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బాలచంద్రుడు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.
- గోస్పాడు: విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమం ప్రారంభమైనట్లు ఎంఈఓ అబ్దుల్‌కరీం తెలిపారు. మండల పరిధిలోని పాఠశాలలో సోమవారం నుంచి వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం బోధన సామగ్రి ప్రదర్శన చేసినట్లు తెలిపారు.
- దొర్నిపాడు: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ2020) ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్(విద్యావారం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రామచంద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మొదటి రోజు ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రిని తయారు చేసి విద్యార్థులతో ప్రదర్శించారు. క్రిష్టిపాడులో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతలక్ష్మి, ఉపాధ్యాలు జయప్రదమ్మ, కల్యాణ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పరామర్శకు తీరిక లేదా?

నంద్యాల(అర్బన్):ముచ్చుమర్రిలో హత్యకు గురైన బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించే తీరిక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేకపోవడం దారుణమని ఎంవీఆర్‌పీఎస్ మహిళా నాయకురాలు భారతి అన్నారు. బాలికపై అత్యాచారం, హత్య జరిగి రెండు వారాలు గడుస్తున్నా కుటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను ఎంవీఆర్‌పీఎస్ మహిళా నేతలు కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అత్యాచారం జరిగిన బాలిక బీసీ కులానికి చెందినది కాబట్టే ప్రభుత్వం స్పందించలేదని, అదే అగ్రవర్ణాలకు చెందిన బాలిక అయితే వెనువెంటనే చర్యలు తీసుకునేవారన్నారు. కార్యక్రమంలో మహిళా నేతలు లక్ష్మి, రాణి, పెద్దక్క, సుబ్బక్క, ఎంవీఆర్‌పీఎస్ మండల గౌరవాధ్యక్షుడు ఓబులేసు, రవి, నగేష్, నాయుడు పాల్గొన్నారు.

'రైతు బంధు' అమలు చేయాలి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మార్కెట్‌యార్డులోని గోదాముల్లో రైతు బంధు పథకాన్ని తిరిగి అమలు చేయాలని సోమవారం భారతీయ కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆయన సోమవారం కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆరోపణలు సరికాదు

ఆళ్లగడ్డ: గిరిజన ఆదివాసి కులానికి చెందిన మహిళ అయిన దేవదాయ కమిషనర్ శాంతి వ్యక్తిగత జీవితంపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని రాష్ట్ర ఎరుకలి సంఘం కార్యదర్శులు నాసారి వెంకటేశ్వర్లు, కాలింగిరి రాముడు పేర్కొన్నారు. అహోబిలంలో సోమవారం ఏర్పాటు చేసిన ఎరుకలి సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగపరంగా ఏదైనా తప్పు చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు.